క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పుల్లలచెరువు: మండలంలోని పిడికిటివానిపల్లిలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో మరియదాసు, కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డిలు తెలిపారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని తెలిపారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి సురేష్ ప్రారంభిస్తారని సర్పంచ్ మస్తాన్‌రెడ్డి తెలిపారు. రూ. 40 లక్షల సచివాలయం, రూ. 25 లక్షల జలజీవన్‌మిషన్, రూ. 5లక్షలతో సీసీ రోడ్డు, రూ. 20 లక్షలతో గ్రామంలో డ్రైనేజీలకు సంబంధించి పలు కార్యక్రమాలను ప్రారంభిస్తారని తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం గ్రామ సచివాలయ పరిధిలోని మెయిన్ బజారు, తూర్పు బజారులో సోమవారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

సచివాయలం, రైతు భరోసా కేంద్రాలు ప్రారంభం

చినమనగుండం గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఉదయం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి ప్రారంభిస్తున్నట్లు సర్పంచ్ వడ్లమూడి మురళీకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రాచర్ల: మండలంలోని గుడిమెట్ట గ్రామంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యేలం మురళికృష్ణ ఆదివారం తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పాల్గొంటారని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


కాలె శివాజి (ఫైల్)

కంభం: స్థానిక శ్రీనివాస ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాలె శివాజి (52) శనివారం రాత్రి గుండెపోటుకు గురై మృతి చెందాడు. శనివారం గుండెపోటు రావడంతో వైద్యశాలకు తీసుకెళ్ళగా అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పలువురు ఉపాధ్యాయులు, రాజకీయనాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పొదిలి ఎస్సైగా వెంకట సైదులు


వెంకట సైదులు

పొదిలి: మండల నూతన ఎస్సైగా వెంకట సైదులు నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్పీ మలికాగర్గ్ ఉత్తర్వులు జారీ చేశారు. పొదిలి ఎస్సై మల్లికార్జునను పదోన్నతిపై ఒంగోలు ట్రాఫిక్ సీఐగా నియమించారు. ఆయన స్థానంలో ఒంగోలులో వీఆర్‌లో ఉన్న ఎస్సై వెంకట సైదులుకు బాధ్యతలు అప్పగించారు.

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు

గిద్దలూరు రూరల్: ఆటో ఢీ కొని ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన మండలంలోని శింగంపల్లె గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. సూరేపల్లె గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి తన బైక్‌పై లింగాపురం గ్రామానికి చెందిన వీరారెడ్డి అనే వ్యక్తిని ఎక్కించుకుని ఉయ్యాలవాడ గ్రామం వైపు వెళుతున్నాడు. ఆ సమయంలో వెనుకాల నుంచి వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ బైక్‌పై నుంచి కింద పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది సంఘటనా స్థలం వద్దకు చేరుకుని క్షతగాత్రులను ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తొలగించిన ఓట్ల పరిశీలన


ఓటర్లను విచారిస్తున్న డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు

దర్శి: ఇటీవల తొలగించిన ఓటర్లను నేరుగా కలిసి విచారణ చేపడుతున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యంవీఎస్ లోకేశ్వరరావు తెలిపారు. ఆదివారం నియోజకవర్గంలోని దర్శి, కురిచేడు, దొనకొండ మండలాల్లో పర్యటించి విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇంకా ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు.

భారీ వర్షం.. రైతులు హర్షం

యర్రగొండపాలెం: గత రెండు నెలల నుంచి వర్షాలు కురవక ప్రజలు అల్లాడుతున్న తరుణంలో శనివారం అర్ధరాత్రి నుంచి యర్రగొండపాలెం ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాల వలన పంటలకు ఎంతగానో మేలు చేకూరిందని వ్యవసాయాధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం తెరిపివ్వడంతో రైతులు తమ పొలాల్లో మిరప పంటను నాటు కోవడం మొదలు పెట్టారు. సాయంత్రం ఉధృతంగా వర్షం కురువడం మొదలు పెట్టింది. నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా పెద్ద ఎత్తున కాలువలు, చెరువులు, కుంటలకు నీరు చేరుతోంది. రాళ్లవాగు ఉధృతంగా పారుతోందని పాలుట్ల ప్రాంతానికి చెందిన రైతులు తెలిపారు. ఉద్యానపంటలకు ప్రాణం పోసినట్లయిందని ఉద్యానశాఖాధికారి పి.ఆదిరెడ్డి తెలిపారు. ఈ వర్షాల వలన భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

రాచర్ల: మండలంలోని సోమిదేవిపల్లె, పాకలవీడు, అనుమలవీడు, రాచర్ల, గుడిమెట్ట, గౌతవరం గ్రామాల్లో శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో అనుములవీడు, పాలకవీడు, గుడిమెట్ట, ఒబుల్‌రెడ్డిపల్లె గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో వర్షపు నీటితో నిండిపోయాయి. భారీ వర్షం కారణంగా వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ వర్షం కురవడంతో పత్తి, మిరప, పొగాకు, కంది, కూరగాయల పంటపొలాలకు ప్రాణం పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొగాకు, మిరప నాట్లు వేసుకుంటున్నారు.

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి 63 మి.మీ వర్షం కురిసి నట్లుగా అధికారులు తెలిపారు. ఇటీవల కాలంలో ఇంత మాత్రం వర్షం కురవకపోవడంతో ఈ వర్షంతో భూములు సాగుచేయడానికి పదునయ్యాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

త్రిపురాంతకం: భారీ వర్షం కురవడంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఒక్కరోజే భారీగా కురిసిన వర్షంతో వాతావరణంలో మార్పు కనిపించింది. మండలంలోని కందుర్లవాగు, కండ్లేరు, దువ్వలేరు, అడ్డవాగులలో నీటి ప్రవాహం కొనసాగింది.

శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయ ప్రాంగణంలోకి వర్షం నీరు చేరింది. త్రిపురాంతకం ఆలయం వద్ద కురిసిన భారీ వర్షం కారణంగా అమ్మవారి ఆలయ ప్రాంగణం నీటితో నిండింది.

మార్కాపురం/కొనకనమిట్ల: మార్కాపురం ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలు జీవం పోసుకున్నాయి. రబీ పంటల సాగుకు భూములు కూడా పదునెక్కాయి. గత రెండు రోజులుగా మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, అర్ధవీడు, యర్రగొండపాలెం, పొదిలి, కొనకనమిట్ల తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. నెల రోజుల క్రితం నాటిన పత్తి, మిర్చి, కూరగాయల పంటలకు ఈ వర్షం ఉపయోగకరమని మార్కాపురం వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు.

రైతులు మిర్చి నారు పోసుకోవచ్చని, కంది, పత్తి కూడా సాగు చేసుకోవచ్చని ఏఓ సూచించారు. మార్కాపురం మండలంలో ఇప్పటి వరకు 5002 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. ఇందులో అత్యధికంగా పత్తి 3264 హెక్టార్లలో, కంది 696 హెక్టార్లలో, మిర్చి 733 హెక్టార్లలో సాగయ్యాయి. ఇంకా సజ్జ, జొన్న తదితర పంటలు కూడా రైతులు సాగు చేశారు. పది రోజులుగా ఎండ తీవ్రత, ఉక్కపోతతో ఇబ్బంది పడిన జనం ఈ వర్షంతో ఉపశమనం పొందారు.


రాచర్ల: అనుమలవీడులో ప్రవహిస్తున్న నక్కలవాగు


యర్రగొండపాలెం చెరువుకు పారుతున్న నీరు


మార్కాపురం వద్ద పత్తి చేలో నిలిచిన వర్షం నీరు


గొట్లగట్టులో కురుస్తున్న వర్షం


త్రిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయ ప్రాంగణంలోకి చేరిన వర్షం నీరు

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి సూచించారు. ఆదివారం ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా టీచర్లకు, సిబ్బందికి నిర్వహిస్తున్న క్రీడల పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిత్యం ఒత్తిడి మధ్య విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల మానసిక, శారీరక ఉల్లాసం పెంపొందించవచ్చన్నారు. విద్యార్థులను కూడా మంచి క్రీడాకారులుగా తయారుచేయాలని సూచించారు. అనంతరం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సీహెచ్ అంజమ్మ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, పట్టణ ఎస్సై శశికుమార్, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కె.ఎర్రయ్య, ఎస్టీయూ నాయకులు ఎస్.ప్రసాదరావు, మండ్లా రామాంజనేయులు, సీహెచ్ గాలెయ్య, ఎ.నారాయణ, హనుమంతరావు, జగన్‌బాబు, నాగయ్య, సురేంద్ర, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

సర్వజనుల శ్రేయస్సే 'మానవత' సంస్థ లక్ష్యం

పొదిలి: సమాజ శ్రేయస్సే మానవత స్వచ్ఛంద సంస్థ లక్ష్యమని వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీవాసవి కళ్యాణ్ సదన్‌లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జీసీ సుబ్బారావు అధ్యక్షతన సంస్థ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. సంస్థ 2004లో పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలో 108 మంది సభ్యులతో ప్రారంభించగా ప్రస్తుతం 45 వేల మందితో కలిసి రాష్ట్రంలోని 13 జిల్లాల్లో గల 95 మండలాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. కడప సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఆర్.గోపి మాట్లాడుతూ.. సంస్థ కార్యక్రమాలకు ఆకర్షితులై ఉన్నత విద్యావంతులు, ఉద్యోగులు, రాజకీయ నేతలు సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. స్థానిక శాఖ కార్యనిర్వాహకుల్లో ఒకరైన కల్లం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. నైతిక విలువల బోధన, పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరాల నిర్వహణ, పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు, ఉచిత వైద్యశిబిరాలు, ఉచిత మార్చురీ ఫ్రీజర్లు, శాంతి రథాలు, శాంతి ర్యాలీల నిర్వహణ, ఆపదలో ఉన్న వారికి ఆత్మీయ సహకారం తదితర కార్యక్రమాలు అందిస్తున్నట్లు చెప్పారు. సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు కల్లూరి రామిరెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు యక్కలి శేషగిరిరావు, కేవీ రమణారెడ్డి, దర్నాసి రాము, కె.యల్లమందారెడ్డి, మాకినేని రమణయ్య, జి.చెన్నారెడ్డి, నూర్జహాన్, వినోద్, జి.శ్రీనివాసులు, కాటూరి పెద్దబాబు, ముక్కు బాలకృష్ణారెడ్డి, సోమిశెట్టి శ్రీనివాసరావు, మల్లవరం వెంకటేశ్వరరెడ్డి, మేడా నరసింహారావు, షేక్.రసూల్, యాసీన్, బండి అశోక్, రోటీ యస్దాని, ముప్వల పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.


సభ్యత్వం నగదు అందుకుంటున్న రమణయ్య

వైభవంగా చెన్నకేశవ స్వామి బోనాలు

పొదిలి రూరల్: పొదిలి మండలం రామాపురం హరిజనవాడలో చెన్నకేశవ స్వామి బోనాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. కాలనీలోని ప్రతి ఒక్కరు ఉపవాసాలతో మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా పోతురాజుకు బండి కట్టి గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం చెన్నకేశవ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవెద్యాలు చెల్లించి మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పోలేరమ్మ తల్లికి పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ ఆవరణలో పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయసిబ్బందిశ్రీధర్ రెడ్డితదితరులుపర్యవేక్షించారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండహారతి పూజలు చేశారు. బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.


పొదిలి రూరల్:చెన్నకేశవ ఆలయం వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


బేస్తవారిపేట:ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి


మార్కాపురం టౌన్:ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ తల్లి

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పూజలు

ముండ్లమూరు: మండలంలోని కొమ్మవరంలో ఆదివారం జరిగిన పోలేరమ్మతల్లి కొలుపులకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. గ్రామస్తులు సకాలంలో వర్షాలు పడి రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ కొలుపుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పోలేరమ్మతల్లి, అంకమ్మతల్లి, నీలంపాటి అమ్మవారు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలతో ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూదిదేవర అంజయ్య, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, వైస్ ఎంపీపీ బంకా రమణమ్మ నాగిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, బొప్పూడివారిపాలెం సొసైటీ మాజీ అధ్యక్షుడు గాదె నాసరరెడ్డి, పసుపుగల్లు ఉప సర్పంచ్ బిజ్జం జ్యోతి కృష్ణారెడ్డి, నాయకులు మందలపు అశోక్, మేకల కృష్ణారెడ్డి, ఏరువ నాగిరెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.


జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకి స్వాగతం పలుకుతున్న నాయకులు

పోలేరమ్మకు పొంగళ్లు

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల గ్రామంలో ఆదివారం రాత్రి గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి గ్రామస్తులు ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ బండ్లు కట్టి ఉత్సవంగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా అమ్మవారి కళశాన్ని గ్రామంలో ఊరేగించారు. మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ ఉడుముల గురవారెడ్డి తదితరులు సకాలంలో వర్షాలు పడి, గ్రామం పాడిపంటలతో పచ్చగా ఉండాలని పూజలు నిర్వహించారు.


ఆలయం వద్ద భక్తుల కోలాహలం

బీజేపీ ఆధ్వర్యంలో నా భూమి-నాదేశం

కొనకనమిట్ల: బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పలు గ్రామాల్లో నా భూమి-నా దేశం, పిడికెడు మట్టి కార్యక్రమం నిర్వహించారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కల్లం సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కిలారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వాగుమడుగు, అంబాపురం, కొనకనమిట్ల గ్రామాల్లో ఇంటింటికీ పిడికెడు మట్టి, బియ్యం సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేవీఆర్, వెంకి, సత్యనారాయణ, మల్లయ్య, నారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంట నమోదుతో రైతులకు మేలు


వేంపాడులో పంట పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ముండ్లమూరు: రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఇ- క్రాప్‌లో నమోదు చేసుకోవడం వలన అనేక ప్రయోజనాలు చేకూరుతాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. శ్రీనివాసరావు అన్నారు. ముండ్లమూరు, వేంపాడులో ఆయన ఆదివారం క్షేత్ర పర్యట చేశారు. ఈ సందర్భంగా రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు, పంట నమోదులో చేసిన వివరాలను పరిశీలించారు. వ్యవసాయ శాఖ రాష్ట్ర కార్యాలయం సూచనల మేరకు వారు కేటాయించిన పొలాలను పరిశీలించి, ఆన్‌లైన్ చేసిన వివరాలతో సరిపోతున్నాయా.. లేదా అని ఆరా తీశారు. రైతులు ఇ- కెవైసీ కూడా చేయించుకోవాలన్నారు. ప్రకృతి వైపరీత్యాల వలన రైతులకు నష్టం వాటిల్లితే ప్రభుత్వ రాయితీలు పొందుతారన్నారు.ఆయన వెంటఏఓఫరూక్ ఉన్నారు.

ప్రజా సంకల్ప వేదిక విజయవంతం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ప్రజాసంకల్ప వేదిక నిర్వాహకులు

దర్శి: ప్రజాసంకల్ప వేదిక దర్శి అసెంబ్లీ ఇన్‌చార్జి సిద్ధికోటిరెడ్డి, కో ఇన్‌చార్జి గంగిశెట్టి సాయితేజ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మదిరె రంగసాయిరెడ్డి హాజరై చట్టాలపై కనీస అవగాహన కల్పించారు. త్వరలో దర్శిలో ప్రజా సంకల్పవేదిక ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తునట్లు ప్రకటించారు. ఇటీవల నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వైవీ సుబ్బయ్య, అట్లూరి రామారావు, మీనిగ శ్రీను, నాగేశ్వరరావు, శ్రీశైలం, బెల్లం గంగారావు, యన్నబత్తిన శ్రీనివాసులు, సురేష్, నవ్య పాల్గొన్నారు.

క్లైంలను విచారించాలి

దొనకొండ: బీఎల్‌ఓలు ఇటీవల నిర్వహించిన ఇంటింటి ఓటరు సర్వేలో కొత్తగా వచ్చిన ఫాం 6, ఫాం 7, ఫాం 8 క్లైంలను జాగ్రత్తగా పరిశీలించి విచారణ చేసి ప్రతి క్లైంకు ఒక ఫైల్ రికార్డు చేయాలని, వాటిని ఎలక్షన్ రూంలో భద్రపరచాలని దర్శి అసెంబ్లీ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి లోకేశ్వరరావు సూచించారు. సర్వే పని తీరును ఆదివారం ఆయన పరిశీలించారు. బీఎల్‌ఓలు ఏవైనా సమస్యలుంటే సంబంధిత తహసీల్దార్‌కు తెలియజేయాలని లోకేశ్వరరావు తెలిపారు. తహసీల్దార్ యం.సువర్ణ, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పొదిలి బస్టాండ్‌లో యాచకుడు మృతి

పొదిలి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో యాచకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. మృతి చెందిన వ్యక్తి కొనకనమిట్ల మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. తెల్లవారుజామున ఆర్టీసీ సిబ్బంది నిద్రలేపినా ఉలుకూపలుకూ లేకపోవడంతో 108కు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి పరిశీలించి మృతి చెందినట్లుగా నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై కారు-బైక్ ఢీ కొట్టుకున్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గొల్లపల్లి వద్ద హైవేపై విజయవాడ వైపు వెళుతున్న కారు దూపాడు వైపు వెళుతున్న బైక్ ఢీ కొట్టుకున్న ప్రమాదంలో మండలంలోని దివేపల్లికి చెందిన సానె వెంకటేశ్వర్లు దొనకొండ మండలం గంగ దొనకొండకు చెందిన వరికూటి నాగేశ్వరరావు, కోటేశ్వరరావు గాయపడ్డారు. పల్నాడు జిల్లా వినుకొండ వైద్యశాలకు తరలించారు.

వైఎస్సార్ సీపీ నేతలకు సన్మానం


రఘునాథ రెడ్డి, ఈశ్వరరెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

బేస్తవారిపేట: మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్‌గా నియమితులైన కొండా రఘునాథ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన పెరుమారెడ్డి ఈశ్వరరెడ్డిలను ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు సన్మానించారు. శాలువ, పూలమాలలతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. బేస్తవారిపేట సర్పంచ్ తండ్రి బుద్ధుల ప్రేమానంద్, ఉప సర్పంచ్ మట్టా రమేష్, సచివాలయ కన్వీనర్‌లు, వార్డ్ మెంబర్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వకర్మ కౌసల్ యోజనపై అవగాహన


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వకర్మవిశ్వబ్రాహ్మణులు

గిద్దలూరు రూరల్: ప్రధానమంత్రి ప్రవేశ పెట్టిన విశ్వకర్మ కౌసల్ యోజన్ పథకంపై విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు రంగాచారి మాట్లాడుతు భారత ప్రధానమంత్రి మోదీ సంప్రదాయ చేతి వృత్తుల వారి అభివృద్ధి కోసం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. వసంతాచారి, నల్లగట్ల వీరబ్రహ్మాచారి, వీరభద్రాచారి, చంద్రశేఖర్‌ఆచారి పాల్గొన్నారు.